

నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం-84
నూరేళ్ళ తెలుగు కథకు



# ఇజాల ఉక్కుపిడికిళ్ళలో నిజాలు ఉలిక్కిపడతాయి

## - నవులూరి వెంకటేశ్వరరావు

నవులూరి వెంకటేశ్వరరావు నవ్వులూరించే కథలు గానీ, నవ్వు లొలికించే కథలు గానీ రాయలేదు. బతుకు భారమైన బడుగు జీవుల పెదవులపై చిరుదరహాసాలు వికసించవని పెను విస్ఫోటాలు ప్రభవిస్తాయని గుర్తించిన రచయిత. విశ్వసాహిత్య అధ్యయనం ఆయనను ఈ మార్గంలో నడిపించడానికి దోహదం చేసింది. ఎంత రాశామన్నది కాదు: ఎందుకు రాశామన్నది, ఎవరికోసం రాశామన్నది ముఖ్యమంటారు. ఇతని సమకాలికుల్లో సమాజ ప్రయోజనాన్ని ఆశించిన రచయితలుండటం,వారితో ఇతనికి పరిచయం, సన్నిహితత్వం ఏర్పడడం ఇతని దిశా నిర్దేశాన్ని చూపాయి.ఎక్కువ సాహిత్యం చదివి తక్కువ రచనలు చేసిన నవులూరి వెంకటేశ్వరరావుతో ఈ వారం...



భార్య లక్ష్మి , మనవడు ఆదిత్యాతో

### వ్యక్తిగత ముచ్చట్లు

ప్రకాశం జిల్లాలోని కనిగిరికి చేరువగా ఉన్న దర్శి గుంటపేటలో జననం. నాన్న లక్ష్మి నరసింహం బడిపంతులు, వ్యవసాయదారుడు. అమ్మ వరలక్ష్మమ్మ. పి.యు.సి వరకు విజయవాడలో చదువు. పద్దెనిమిదేళ్లకే విశాఖపట్నం పోర్టు ట్రస్టులో గుమాస్తాగా ఉద్యోగ జీవితం. అధికారి హోదాలో పదవీ విరమణ. భార్య మల్లంపల్లి లక్ష్మి.ముగ్గురు పిల్లలు. ఒక మనవడు.

### అమ్మ కథలతో సాహిత్యం వైపు

మా అమ్మ స్వగ్రామం, ఇంటిపేరు కూడా కావలి దగ్గరున్న మోచర్ల. అమ్మ నా చిన్నప్పుడు కథలు చెపుతూ పద్యాలు నేర్పిస్తూ ఉండేది. వాళ్ల కుటుంబంలో, మునుపెన్నడో ఒక కవి ఉండేవాడని, ఒక ఆస్థానంలో ఉండేవాడని అనేది. ''గుండ్రాయికి కాళ్లు వచ్చి గునగున నడిచెన్'' అనే చాటువును కూడా తరచు వల్లిస్తుండేది. ఆయనే 230 యేళ్ళ క్రితం వెంకటగిరి రాజా సంస్థానంలో ఉన్న కవి మోచర్ల దత్తప్ప అని సాధికార గ్రంథం ద్వారా తెలుసుకున్నాను. ఆరుద్ర కూడా దత్తప్ప సోదరుల గురించి రాశారు. దత్తప్ప ఒక గంటలో 124 చాటువులు ఆశువుగా చెప్పిన దిట్ట.

### తొలి కథ

విజయవాడ గవర్నరుపేట రామ్మోహన గ్రంథాలయంలో బాల్యంలోనే వయసుకు మించిన పుస్తకాలను అర్థం కాకపోయినా చదివాను. సత్యనారాయణపురంలో బడికి వెళ్తూ వస్తూ, దారిలో ఉన్న మూడు గ్రంథాలయాలకు వెళ్లేవాడిని. అపరాధ పరిశోధన నవలలు, ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రిక వగైరాలు చదివేవాడిని. పెద్దిభొట్ల సుబ్బరామయ్య రచనలు ఇష్టంగా చదివాను. విశాఖలో ఉన్నప్పుడు చదివిన 'చివరకు మిగిలేది', 'రాజు-మహిషి' మనసుకు హత్తుకున్నాయి.

1970లో విశాఖ రచయితల సంఘం స్ఫూర్తితో ఆంగ్ల పుస్తక పఠనం ఆరంభించాను. ఆ సంఘంలో ఒక వర్గం ప్రవర్తన నచ్చక, 'విశాఖ సాహితి' పేరుతో వేరే సాహిత్య కుంపటి పెట్టి రాజేశాం. అక్కడ, అంతకుముందున్న సంఘంలో కాస్త మేథో ప్రేరణ (ఇంటలెక్చువల స్టిములస్) లభ్యమయింది. విశాఖ సాహితి వారి కథా సంకలనంలో నా తొలి కథ ప్రచురితమ్మైంది. దాని తర్వాత స్వాతిలో 'అద్దం' అచ్చయింది. (డిశెంబరు 1972)

### తిరిగి వచ్చిన నవలకు బహుమతి

'శిథిలం' అన్న నవలను ఆంధ్రప్రభకు పంపేను. రెండు సంవత్సరాల తర్వాత నా నవల నాకు తిరిగి వచ్చేసింది. 1994లో కూరెళ్ల సోమేశ్వరరావుగారి సోమేశ్వర సాహితి నవలల పోటీలో దానికి ప్రథమ బహుమతినిచ్చారు. 180 పుటల ఆ నవలలోని కొన్ని అంశాలతో 95 పుటల నవలగా చేసి 'అవశేషం' పేరుతో చతురకు పంపగా డిసెంబరు 2007లో దాన్ని ప్రచురించారు. అవినీతి,లంచగొండితనంపై రాసిన మరొక నవల 'దాసోహం' అముద్రితం. అంగర వెంకట కృష్ణారావు గారు యుద్ధం నేపథ్యంలో రాసిన ప్రసిద్ధ నవల 'విరామం'ను ఆంగ్లంలోకి తర్జుమా చేశాను.

### యాభై కథలు


రాసిన యాభై కథలకుగాను నాలుగింటికి వివిధ ప్రముఖ పత్రికల్లో బహుమతులొచ్చాయి. ఆంధ్రప్రభలో కథాప్రభ శీర్షికన నా పది కథలు అచ్చయ్యాయి. 'చాట ఉడతలు' అన్న కథ 'ఉదయం' వారపత్రిక కార్యాలయంలో ఓ మూల మూడేళ్ళు దుమ్ములో దొర్లుతున్నప్పుడు, 'పురాణం'గారు దాని సంపాదకునిగా వెళ్ళిన తర్వాత కథ దుమ్ము దులిపి ప్రచురించారు. ప్రచురణ విషయం సంవత్సరం తర్వాతగానీ తెలియలేదు. 'వాకాటి' వారు నా కథ 'జాలి'ని మెచ్చుకోవడం మరువలేను. ఆంధ్రప్రభ కథలపోటీలకి పంపిన 'గర్భగుడిలో గబ్బిలాలు' సాధారణ ప్రచురణగా అచ్చయింది. మా కార్యాలయ ఫలహారశాలలో పదహారేళ్ల పని కుర్రాడు సుఖరోగంతో (అప్పటికి 'ఎయిడ్స్' అనే పదం ప్రాచుర్యంలోకి రాలేదు) బాధ పడుతుండడం చూచి 'పిల్ల తెమ్మెర' రాస్తే, 'జ్యోతి'లో దానికి బహుమతి వచ్చింది. బైబిల్ తిరగేస్తూ-శిలువ మీదనున్న ఏసు, ''ఓ భగవంతుడా, ఓ భగవంతుడా, ఎందుకు నన్ను పట్టించుకోకుండా వదిలేశావ్?'' అని ఆఖరుగా విలపించి మరణించాడని చదివి, ఆశ్చర్యపడి-'ఎలోయ్, ఎలోయ్,లామా సబాచ్తనీ?' రాశాను.

### ఇజాలు, వాదాలకు దూరం

సాహిత్యంలో ఇజాల, వాదనల సరిహద్దులు ఉండకూడదు అని నా నమ్మిక. సరిహద్దులు ద్వేషాలకు కాల్పులకు దారి తీస్తాయి. వాటికి కట్టుబడి ఉండటమంటే జీవిత విస్తృతిని, సంక్లిష్టతను మరచినట్లే అని నా భావన. నైతికమ్మైన, అనైతికమ్మైన పుస్తకాలుండవు: బాగా రాసినవి, రాయనివి మాత్రమే ఉంటాయి: అంతే-అన్న అందరికీ తెలిసిన ఆస్కార్ వైల్డ్ మాటలు స్ఫూర్తి దాయకాలు. బాగా రాయడం అంటే అంశానికి పెద్ద పీట వేయాలి. ఎ.జి.గార్డ్‌నర్, జేమ్స్‌హాడ్లీ ఛేజ్, అర్థర్ కానన్ డాయల్, మేరియో ప్యూజో, ఉడౌస్ పుస్తకాలన్నీ గుండెకు హత్తుకోదగినవే: రంజింప చేసేవే. 'సీరియస్' రచయితలతో బాటు ముందు పేర్కొన్న వాళ్లూ చిరంజీవులే. ఇజాల ఉక్కు పిడికిళ్లలో నిజాలు విలవిలలాడతాయి.

### సామాజిక రుగ్మతలు-సాహిత్యం

చార్లెస్ డికెన్సు, వోల్టేరు, వైల్డ్ లాంటి యుగ



కుటుంబ సభ్యులతో...

పురుషుల రచనల వలన ప్రభుత్వాలు కదిలే అరుదైన వీలు, ప్రజలు విప్లవోన్ముఖులయ్యే అరుదైన సందర్భాలూ ఉంటాయి. మన లాంటి దేశంలో సాహిత్యం ద్వారా సాధించగలిగేది స్వల్పానుస్వల్పం. సామాజిక మార్పులు సాహిత్య రచనల ద్వారా అసాధ్యాలు: అంతటి గొప్ప రచయితలూ అరుదు. ప్రజా భావజాలాన్ని సాహిత్యం ద్వారా మార్చగలం అనుకుంటే అది విశ్వాసం అవదు: మనల్ని మనం అధికంగా అంచనా వేసుకోవడం అవుతుంది. 'నిబద్ధత' గల శ్రీశ్రీ, రా.వి.శాస్త్రి లను ఎలాంటి నిబద్ధతాలేని జేమ్స్ జాయిస్ తన 'యులిసెస్' (ULYSSESS) ద్వారా ప్రభావితం చేశాడు. సామాజిక రుగ్మతలను మాన్పడం, సమస్యలను తీర్చడం వార్తా మాధ్యమాలకు సాధ్యం: ప్రభుత్వ పునాదులు వాళ్లు కదపగలరు. ఒక కథా రచయిత కన్నా ఒక పాత్రికేయుడు సమాజానికి 'ఉపయోగ' పడతాడు. 'నీవు ఎవరి పక్షాన?' అన్న ప్రశ్న వాగాడంబరం.

### వందేళ్లకు మిగిలింది ఒక్క 'కన్యాశుల్కమే'

సాహిత్యానికి పడికట్టు రాళ్లున్నాయి. వాటితో తూచితే, అచ్చుకు నోచుకుంటున్న రచనలలో చాలా ఎక్కువ శాతాన్ని వేరే పేరుతో పిల్చుకోవాలి. మరుగుజ్జులను ఆజానుబాహువులుగా పరిగణింపచేసే పైరవీ సంస్కృతి 1970 నుంచి ఆరంభమైంది. హెమింగ్వే తన 'ఆయుధాలకు వీడ్కోలు' (నవల) ఆఖరి పుటను 39 మార్లు పదే పదే రాశాను అన్నాడు. రాసే తొందరైతే ఒక్క పుటల 'షిట్'కు (తర్జుమా చేయడం లేదు) ఒక పుట చొప్పున కళాఖండం రాస్తాను: షిట్ ను చెత్త బుట్టకు ఎత్తే ప్రయత్నం చేస్తాను అన్నాడు. ఒక కవితను దిద్దే ప్రయత్నంలో పొద్దునపూటనంతా గడిపాను: చివరకు ఒక కామా తీసేశాను: మధ్యాహ్నం ఆ కామాను తిరిగి పెట్టేశాను' అన్నాడు వైల్డ్. శైలికి పెట్టిన పేరుగా ప్రసిద్ధి చెందిన ఫ్లాబే, ఒక్క పుట రాయడానికి వారం పాటు జుత్తు పీక్కునేవాడట. 'నేనూ వాళ్లందరిలా జుత్తును కోల్పోతాను, చెమటనూ కారుస్తాను' అని ఏ తెలుగు వారన్నా అంటే సంతోషం. ఒక్క 'కన్యాశుల్కం' తప్ప అంతర్జాతీయస్థాయి మరొక రచన ఏదన్నా ఉందేమో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ఒకసారి 'నార్ల వెంకటేశ్వరరావుగారు ''దురదృష్టవశాత్తు, మన రచయితల లోకం ఇరుకైనది. ఎందుకంటే జీవితంతో వాళ్ల పరిచయం అంతంత మాత్రం. యుద్ధం, సముద్రయానం, అడవి మృగాల వేట, అంతర్జాతీయ వాణిజ్య వ్యాపారాలు, పర్వతారోహణ, ఆర్థిక రంగం, స్టాక్ ఎక్స్చేంజి, దౌత్యకళ మెళకువలు, అధో ప్రపంచ నేరాలు, మరో వేయి ఇలాంటి విషయాల గురించి ఏ మాత్రం తెలియదు. వాళ్ళకు తెలిసిన ఇంటి, మధ్య తరగతి జీవితం గురించి మాత్రం రాస్తారు'', అన్నారు. అలాగే పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు: ఇది ఏజ్ ఆఫ్ మీడియాక్రిటి. ద్వితీయ శ్రేణి రచయితలకే పూజలూ, పునస్కారాలూనూ'' అని ఏదో సందర్భంలో చెప్పారు.

### కథానిక-కొత్త కదలిక

ఆ మధ్య వందేళ్ళ కథానిక పండగ చేసుకుని మనల్ని మనం అభినందించుకున్నాం. ఆ మాత్రం సంబరాలు జరిపినందుకు నిర్వాహకులను ప్రశంసించాలి. కానీ, 'గురజాడ' వారి 'పెద్ద మసీదు', 'మీ పేరేంటి?' అన్న వాటితో తూగగల తెలుగు కథలు ఉన్నాయా? ఉంటే ఎన్ని? ఆ రెండు కథలూ గీటురాళ్లుగా, ఈ వందేళ్లుగా తెలుగు కథకు ఎన్ని వన్నెలు

### నచ్చినవి

| | | |
|---|---|---|
| కథ | : | కాథరీన్ ఆన్ పోర్టర్ |
| కథకులు | : | చెకోవ్, మొపాసా |
| నవల | : | ది బ్రదర్స్ కరమజోవ్ |
| నవలాకారుడు | : | దాస్తోయెవ్స్కీ |
| గాయకుడు | : | మహమ్మద్ రఫీ |
| గాయని | : | లతా మంగేష్కర్ |
| సంగీత దర్శకుడు | : | ఇళయ రాజా |
| రాగం | : | కీరవాణి |
| నటుడు | : | నందమూరి తారక రామారావు (స్వర్గీయ) |
| నటి | : | బి.సరోజాదేవి, మాలా సిన్హా |


బి.కె.రావు, ఐ.ఏ.ఎస్ (పోడుట పైట్సన్) రచయిత ఘండికోట బ్రహ్మాజీరావుతో...

తెచ్చిపెట్టామో కఠినంగా యోచిస్తే, తెలుగు కథకు నిజమైన ఒక సేవ చేసిన వాళ్లం అవుతాం. 'పెద్ద మసీదు'ను గురజాడ హెమింగ్వేకు గురువులా హెమింగ్వే పుట్టక ముందే, క్లుప్తతతో రాశారని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి.

### రచనలు ఎలా ఉండాలి?

హెమింగ్వే, 'ది ప్యారిస్ రెవ్యూ'కు ఇచ్చిన సుదీర్ఘ ముఖాముఖీ వ్యక్తీకరించిన భావాలను కొన్నింటిని ఇక్కడ చెప్పాలి:-

రచయిత ఎంత మేరకు బాగా రాయగలడో ఆ స్థాయికి రచన వచ్చేంత వరకు తనను తాను హింసించుకోవాలి. రచయితల సాంగత్యం మేధకు పదును పెడుతుంది. పరిశీలించడం మానేసిన మరుక్షణం రచయితగా దివంగతుడయినట్లే. ఐతే, కావాలని పరిశీలిస్తూ, దాన్ని ఎలా ఉపయోగించుకోవాలా అన్న దృష్టితో ఉండకూడదు. పరిశీలించే అవసరం ఆరంభకాలంలోనే ఉంటుంది. క్రమేణా మనం చూచినదంతా మనకు అంతకు ముందే తెలిసి ఉన్న విషయ పరిజ్ఞాన భాండాగారంలో దానంతట అది చేరిపోతుంటుంది. ఐస్‌బెర్గ్ (సముద్రంలో తేలియాడుతూ కదలిలే మంచు కొండ) సూత్రానికి అనుగుణంగా రాయాలి. రాస్తున్న విషయం మీద రచయితకు చాలినంత అవగాహన ఉంటే ఆ విషయాలు రాయకపోయినా వాటిని చెప్పిన అనుభూతి పాఠకుడికి అందుతుంది. ఐస్‌బెర్గ్ కదలిక యొక్క హుందా తనానికి కారణం, అది పదింట ఎనిమిదొంతులు నీటిలో దాగివుండటం. రచయిత అవగాహన ఐస్‌బెర్గ్ కనిపించని భాగం. సరైన రచయితైతే ఉన్నదాన్ని వర్ణించడు. చెకోవ్, ''చంద్రుడు మెరుస్తున్నాడని నాకు చెప్పకు. పగిలిపోయిన గ్లాసు మీది వెలుతురు మెరుపును చూపించు'' అంటాడు.

### సాహిత్యం అంటే...

ఒక ఆలోచనను, ఆవేదనను, ఉద్వేగాన్ని, ఉద్రేకాన్ని, ఆశాభంగాన్ని, సంతోషాన్ని, విస్మయాన్ని పంచుకోవడానికి సాహిత్యం ఒక మాధ్యమం. అంతే! స్వీయానుభవం నుంచి గాని, మరో చోట నుంచి గాని సముపార్జించిన పరిజ్ఞానం ముడి సరుకుగా వాస్తవాన్ని కనుగొనాలి. దానిని చిత్రించగలగాలి రచయిత. ఒక్కోసారి వ్యక్తిగత, అవ్యక్తిగత పరిజ్ఞానం నుంచికాక, మరుగున పడిపోయిన కుటుంబానుభవం లేక జాతి లక్షణాలకనుగుణంగా, రచయితలో పరిజ్ఞానం నిబిడీకృతమై ఉంటుంది. వాస్తవం వాస్తవంగా అందరికీ కనబడుతున్నపుడు, రచయిత తన అవగాహనా భాండాగారం నుంచి కొత్త విషయం కనుగొనాలి. అది ప్రతిబింబం కాదు. కొత్త విషయం-వాస్తవంకన్నా ఎక్కువ వాస్తవమైనది, సజీవమైనది అయిఉండాలి. ఇందులో రచయిత సఫలీకృతుడైతే అతను కనిపెట్టింది, రాసింది, శాశ్వతంగా మిగిలి ఉంటుంది. ప్రవాహంలో కొట్టుకుపోదు.


మేడా మస్తాన్‌రెడ్డి
సెల్ : 9441344365

నాకు నచ్చిన నా కథ

# విషాదయోగం

- వవులూరి వెంకటేశ్వరరావు


డాబా తూర్పు పిట్టగోడ వైపు ఎవరో లాగుతున్నట్లు వెళ్ళి, బలంగా గాలి పీల్చి, వదిలి, ‘‘నరవాసన’’ అనే రాక్షసుడిలా, ‘‘ముదరమాగిన జీడిపండ్ల వాసన’’ అన్నాడు భద్రం - మా వైపు తిరుగుతూ.

‘‘తింటావా?’’ అడిగా.

‘‘జీడిపిక్కలుంటే నాచేత తినిపించు’’.

‘‘పచ్చివా, వేయించినవా?’’

‘‘పచ్చివైనా నమిలి మింగెయ్యగలడు. నీకు అనుమానమా?’’ సూర్యం.



‘‘భద్రంతో పాతికేళ్ల అనుభవం’’ అతని సామర్థ్యం మీద నాకు ఇసుమంతైనా సందేహం లేదని సూచనప్రాయంగా వ్యక్తం చేశాను.

‘‘ఉత్తమాటలెందుకు?’’ తొందర పడ్డాడు భద్రం.

మెట్లు దిగుతున్నప్పుడు ‘‘పండ్లు కూడా తే’’ అరిచాడు పైనించి.

కిందికెళ్లి పళ్లెంలో, వేయించిన జీడిపిక్కలు, ఎరుపు తిరిగిన జీడిపండ్లు, చెంబుతో నీళ్లూ, గ్లాసులూ తెచ్చేసరికి డాబా కురుక్షేత్రంలా ఉంది.

‘‘ఇంతకూ, తినటానికే పుట్టి, తినటానికే జీవితం కొనసాగిస్తున్నానంటావ్?’’ సుబ్బు భద్రాన్ని నిలేస్తున్నాడు.

‘‘ఘనత వహించిన పెద్దలారా, తమ జన్మలెందుకో, జీవితాలు ఏ గొప్ప ఆదర్శానికై కొనసాగుతున్నాయో శలవీయండి’’.

‘‘తినటం గురించి మాత్రం కాదు’’.

‘‘ఒక కొలిక్కిరాని వ్యర్థపు ఆలోచనలతో గడపటానికేమో?’’ రెట్టించాడు భద్రం.

‘‘భద్రాన్ని తినెయ్యకండిరా; వాడ్ని ముందు వీటిని తిననీయండి. ఆ తర్వాత మీ అఘోరింపు సాగించొచ్చు’’ జోక్యం చేసుకున్నా.

‘‘ఏ ప్రశ్నా, ఆలోచనా నన్ను వేధించదు’’ ప్రకటించాడు భద్రం.

‘‘జీడిపండ్లు, పిక్కలు మాత్రం నీలో కదిలికను తెస్తాయి’’ ఖైనీ ఇస్తున్న మత్తు, మాటల్లో వ్యక్తమవుతుండగా అన్నాడు సుబ్బు.

‘‘జీవిత స్వభావం, ప్రాయోజకత, నిగూఢత, తాత్కాలికతల మీద ఎందరు బుర్రలు పాడుచేసుకోలేదు? వాళ్లకన్నా మేధాసంపత్తి ఉన్నవాళ్లం కాదు. దానివల్ల ప్రయోజనమూ లేదు. ఈ ప్రహేళికలకు సమాధానాలు దొరకవు. మెదడును శ్రమ పెట్టకుండా ఆ పెద్ద సమస్యలవైపు చూడకుండా; ఎందులో సుఖం, ప్రశాంతత దొరుకు

తాయో వాటిలో నిమగ్నమయి జీవితం వెళ్లబుచ్చటం ఉత్తమం. అయితే ఇక్కడ ఒక రైడర్ ఉంది; అలా ఉండటం సాధ్యపడాలి''.

''దీనికి జీడిపిక్క సిద్ధాంతం అని పేరు పెడితే పోలా?''

''గాడిదకేం తెలుసు. జీడిపిక్కల రుచి? అందులో మీలాంటి బ్యూరిడన్జ్ ఏస్‌లకి?''

''ఎవరో అన్నట్లు, ఆ ప్రశ్నలకు సమాధానాలు దొరికి పోతే ఆలోచించటానికి ఏం మిగిలి ఉంటుంది?''

''మేధలను వేధించే పారభౌతిక మీమాంస; సర్వజన ఆమోదయోగ్యం కానివే అయినా, సమాధానాలపై శోధన ఆస్తికరమైన వ్యాపకం – జీవితపు నిజమైన వ్యాపకం. అంతేగాక, జీవితాన్ని భరించగలగటానికి మనిషి కళలు, సాహిత్యం, సంగీతం సృష్టించుకున్నాడు''.

''అసలు, నిరంతరానందపు మానసిక స్థితి ఒక పిచ్చిలాంటిది. చెకోవ్ కథ 'ది బ్లాక్ ఫ్రైయర్'లో కొవ్రిన్‌కు పట్టిన లాంటిది. అతన్ని ఏదైనా చికాకు కలిగించింది ఉంటే అది అంతటి ఆనందం కలుగుతోందేమిటి అన్న భయం. ఆ ఆనందం అతన్ని తలమునకలు చేసి, జీవితపు విసుగుదల, విచారం దరికి రానీదు. అతని చావూ చిరునవ్వుతో ముగుస్తుంది. 'కాస్త కన్నీరు, మరికాస్త సంతోషపు తేనీరుతో'' కూడిన బతుకే నయం''.

ఈ ఇల్లు ఊరికి చాలా ఎత్తు ప్రదేశంలో కట్టినది – ఊరును కాపు కాయటానికి కట్టిన మంచెలా. ఉత్తరం వైపు దేవస్థానపు కొండలు. వర్షాకాలం, శీతాకాలం నాటి భోగం చూడాలి. పచ్చటి వృక్ష సంపదతో భాగ్యవంతంగా కనిపిస్తాయి. ఎండాకాలం వచ్చి పచ్చదనం మీద విరుచుకుపడుతుంది. కొండల నగ్నత్వాన్ని బట్టబయలు చేస్తుంది. కొండవాలులో, ఇంటికి తూర్పువైపు జీడితోట.

తోట కవతల, కొండ అంచుమీది నుంచి బద్ధకపు పిల్లిలా ఒళ్లు విరుచుకు లేస్తోంది చందమామ. నేలపాలయి, మౌనంగా దొర్లుతుండే పాలలా, తోట మీదుగా వచ్చి డాబాను దాటి, లోకమంతా విస్తరిస్తోంది వెన్నెల. వెన్నట్లో, తోట నీడ గుబులు పుట్టిస్తోంది. ఆ గుబులు 'వ్యర్థమయిన ప్రశ్నలకు ఆస్కారం కలిగిస్తోంది'.

ఇలాంటి వాతావరణంలో ఎప్పుడన్నా ఒక్కడినే తోటవైపు తిరిగి ఇక్కడ కూర్చుంటే – డాబా మీది నుంచి ఒక్క ఎగురు ఎగిరి వెన్నెలలో, తోట నీడలో, నిశ్శబ్దంలో ఐక్యమయి పోవాలనిపిస్తుంది. అది తీరటం అసాధ్యమయిన కోరిక. ఆ మానసిక స్థితి ఒక పిచ్చిలాంటిది. నలుగురు మిత్రులం కాకతాళీయంగా కలిసిన ఈ సమయాన ఆ మూడ్ దయ్యపు గబ్బిలంలా తన రెక్కల కిందికి తీసుకోబోతుంటే దాన్ని అదిలించడానికి సూర్యంతో అన్నా–

''ఎలా ఉంది రాంచీ జీవితం?''

''ఇక్కడిలాగే, ఎక్కడిలాగే, కాకపోతే ఎప్పుడు వర్షం ముంచుకొస్తుందో తెలీదు; విపరీతమైన చలి, ఎండ, ట్రైబల్ అలజడులు, చిన్నదానికీ పెద్దదానికీ ఉద్యమం, అనూహ్యమైన టెంపర్‌మెంట్లు. నేను పనిచేసే కాలేజీలో విద్యార్థులకు విద్య మినహా మిగతా అన్ని వ్యవహారాల్లో పరిమితికి మించిన ఆసక్తి; మాకు మా జీతాలు వినా దేనిమీదనయినా అనాసక్తి''.

సూర్యానికి రాంచీ నించి ఇంటర్వ్యూకు పిలుపు వచ్చినప్పుడు ''నోరేసుకు పడిపోయి నెగ్గుకొస్తుంటావు గదా, ఈ నోటిమీద బతికే ఉద్యోగం నీకు గాక ఎవరి కొస్తుందిలే పోయిరా'' అన్నాడు వాడిని రైలెక్కిస్తూ భద్రం.

భద్రం ఒక ఆయిల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గడకర్రలా ఉంటాడు. పొడువుగా, వంగి, మొహం నూనె కారుతుంటుంది. 'నీ మొహం చూసి తక్షణమే నిన్ను ఎంపిక చేస్తారు పోరా నూనెరావ్'' అన్నాడు. సూర్యం కసి తీర్చుకుంటూ – భద్రం సెలెక్షనుకు వెళ్లే రోజు.

ఎన్ని సంవత్సరాలయింది అవి జరిగి?

సుబ్బుకు చాలాకాలం ఉద్యోగం దొరకలేదు. విసిగిపోయి, భార్యనన్నా సేవిస్తూ గడపొచ్చని పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత, మామ డబ్బు పెట్టుబడి పెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దించాడు అల్లుడిని. ఎప్పుడు ఈ ఇంటికి వచ్చినా ''ఈ జీడితోట కొట్టేసి లే అవుట్ వేస్తే గజం ఎంత పలుకుతుందంటావ్ రొరే'' అనేవాడు. ఒకసారి. అలా అన్న తర్వాత నిముషం ఊరుకుని ''నాలో,



నాకు తెలీకుండానే ఎంత దరిద్రమైన మార్పొచ్చిందో చూశావ్‌రొరే'' అన్నాడు విచారంగా.

అదంతా గుర్తుకొచ్చి కవ్వించడానికి అన్నా–

''ఈ తోట ధ్వంసం చేసి ఇళ్ల స్థలాలుగా అమ్మితే గజం నాలుగు వందలు పలుకుతందిరొరే''.

''మా మామకు చెప్పేశానురా, స్థలాల వ్యాపారమే గాదు, ఏ వ్యాపారమూ చేయనని''.

''విషాదయోగానికి లోనైన సుబ్బుగాడు గారికి సత్తెయ్య మామ ఉపదేశం చెయ్యకుండా వదిలేశాడా?'' సూర్యం.

''చేశాడు. ఒకరోజు కాదు. పద్దెనిమిది రోజులు, వీడు మొండివాడు; అర్జునుడు కాదు. అయితే జీవితపు నిరర్థకత. నాలోని ఎందుకో తెలీని నైరాశ్యం నన్ను ఏ పనికీ పూనుకోనివ్వటం లేదు. ఏ వ్యాపకం లేక పోవడం విసుగు కలిగిస్తోంది''.

ఇది ఒక పేరడాక్స్.

''నిన్నమొన్నటి అబ్బాయిలూ! నా జీవితనుభవాన్ని ఒకదాన్ని ఈవేళ పంచుకోవాలనిపిస్తోంది. విక్రమార్కుడి మార్కు ఓపిక మీలో ఉంటే'' నేను.

''మా మాట ఎలా ఉన్నా నీకు అది ఆనందానిస్తే మేమెందుకు కాదనాలి?''

''కోరాపుట్‌ను చూస్తే చాలు, ఆ జిల్లా ఎంత వెనుకబడిందో తెలియడానికి. నేను ఆ ఊరు చూడటానికి వెళ్లినప్పుడు, ఆర్‌సిసి స్లాబున్న కట్టడం ఏదీ కనబడ్డట్లు గుర్తు లేదు. ఆ ప్రాంతం ఏదైనా ప్రభుత్వ పాలనలో ఉందా లేక రాతియుగపు అవశేషంగా, మ్యూజియం పీస్‌లా పరిరక్షించబడుతోందా అన్న అనుమానం కలిగింది. అభివృద్ధి, నాగరికతల పేరుతో ఈ ఏజన్సీ ప్రాంతాన్ని చెరచకుండా వదిలేశాను. ఒక విధంగా అది మేలయిన విషయమే అని అనుకోడానికి లేదు. విధ్వంసం ఆరంభమయి కొనసాగుతోంది. స్థానికుల జీవన స్థితిగతులు మాత్రం ఎలాంటి మార్పులకూ నోచుకోవటం లేదు. ఆ ఊరుకు పదిహేడు,

పద్దెనిమిది కిలోమీటర్లు దక్షిణంగా సునాబెడ తగులుతుంది...''

''జేపూరు, నౌరంగ్‌పూర్, జగదల్పూరు వెళ్లాలంటే ఆ ఊళ్ల మీదుగా వెళ్లొచ్చు గదా? నౌరంగ్‌పూర్లో మా బంధువులున్నారు''.

''1965లో అనుకుంటా సునాబెడలో విమానాల కార్ఖానా పని చెయ్యటం మొదలయింది. అప్పటినుంచి కాస్త నాగరకత విస్తరించటం మొదలయింది. ఫ్యాక్టరీ టౌన్‌షిప్ ఏర్పడింది. పాతిక వేల జనాభా కూడారు. అనేక రాష్ట్రాల వాళ్లూ, భాషల వాళ్లూ, కులాల వాళ్లూ, మతాల వాళ్లూ, ఆ ఊరు, భారతదేశ ఆదర్శానికి ఒక ప్రతీక. సముద్ర మట్టానికి రమారమి 2,500 అడుగుల ఎత్తునుంది. శీతాకాలం విపరీతమైన చలి. రాత్రిళ్లు నాలుగయిదు డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోతుంది. మండు టెండలలో ఉన్నట్లుండి వర్షం పడుతుంది. చాలా అరుదయిన విశిష్టమయిన వర్షం. మబ్బుల నించి చినుకులు నేలమీదికి రాలటమే గదా వర్షమంటే; వర్షం పేరుతో ఎక్కడా జరిగేదింతే! అని సూరిగాడు అడ్డుపుల్ల వేయబోతున్నాడు. వృత్తిరీత్యా, తను మాట్లాడటమే గాని అవతలి వాడు చెప్పేది వినే అలవాటుపోయింది. గదా... జాతిగా మనుషులంతా ఒకేలా ఉండొచ్చు. వ్యక్తిగా ఎవడి ప్రత్యేకత వాడిది. ఆ వర్షానికి వయ్యారం, సొంపు, రౌద్రం, భీతి కలిగించే గుణం – అన్నీ ఉన్నాయి. ఒకసారి చూసిన వేసవి వానజ్ఞాపకమై వెన్నంటుతూనే ఉంటుంది. మనిషి చావకుండా జీవితమూ విలువైనదే అనిపించి, దానితో ముడిపెట్టి, ఇలాంటి అనుభవాలూ తత్సంబంధమైన జ్ఞాపకాలూ ఇంకా ఉండవచ్చు, జీవితం కొనసాగిద్దాం అనిపించే జ్ఞాపకమది...''


''సరే వర్షం సంగతి వదిలెయ్!''

''సరే! పెళ్లయిన వారం రోజులకు మొదటిసారిగా – నాకు మాత్రం మొదటి సారి – నేను, నా భార్య రుక్మిణీ నవంబరు మాసాంతంలో ఆ ఊరు బయలుదేరాం. పెళ్లయిన వెంటనే, వారం ముందుగానే వెళ్లాల్సింది. అది దివిసీమను ఉప్పెన ముంచిన సంవత్సరం. ఘాట్ రోడ్డంతా పెద్దపెద్ద కొండరాళ్లు దొర్లి, చరియలు కూలి వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. సాలూరు దాటిన పావు గంటకు కొండ రోడ్డు ఆరంభమవుతుంది. కొండను చుట్టి చుట్టి, సుంకి దగ్గర విశ్రాంతి తీసుకుంటుంది. సుంకి అంతరాష్ట్ర సరిహద్దు. ఒరిస్సా, ఆంధ్రాల సంయుక్త చెక్‌పోస్టు ఉంది. సుంకి ఒక లోయ – శిఖరాలు కూలటానికి వీలుగా, లోయ దిగువన సెలయేటి గలగల వినిపిస్తుంది, నాగరికత శబ్దాలు వినబడనిచ్చినప్పుడు ఎవరితోనో ఊసులాడుతున్నట్టు; ఎవరూ వినక తనలో తను ముచ్చటిస్తున్నట్లు; కూనిరాగంలా, నిరంతరంగా, దిగులుగా, వైరాగ్యంగా, చీకటి సందిగ్ధంగా మూగుతోంది. పక్షుల అలజడి – రాత్రి బందిఖానాకి సిద్ధమవుతూ. రహదారికి అటూ ఇటూ మూడు నాలుగు పాకలు, ఒకటీ కొట్టు ఒక మలయాళీది. రోడ్డుకు ఇరువైపులా ఆగిన తనిఖీ చెయ్యాల్సిన వాహనాలు.

''బస్సు దిగమంటే 'ఎందుకూ' అంది కాటుక చెదిరిన, అలసిన కనురెప్పలు మూసి తెరచి. కొత్త సాంగత్యపు నునుసిగ్గు పూర్తిగా జారిపోలేదు. అలా వెళ్లి వద్దాం అన్నా. ముద్ద సంపెంగలు నలిగి, నొక్కుల జుత్తులో జారుకున్నాయి. సువాసన, మొహం మొత్తుతూ. ఇష్టమయిన వ్యక్తులు అయిష్టమయిన పనులు చేసినా భరించగలం అన్న విషయం చెప్పక్కరలేదు. ప్రేమపాశంలా తుంటి దాటి వేలాడుతున్న వత్తు జడ''.

''నీ భార్య ఎలా ఉంటుందో మాకు తెలీదేంట్రా?''

''నేను చెప్పేది వినే ఓపిక లేకపోతే, జీడిపండ్లూ పిక్కలు తింటూ భద్రం




చేసే చప్పుడు వింటూ కూర్చుందాం''.

''కానీయరా, సూరిగాడితో ఏమిటి?'' పొట్టు వదలగొట్టి, జీడిపిక్కలు నోట్లో విసురుకుంటూ అన్నాడు భద్రం.

''భద్రానికి తింటున్ననే గాక వింటున్నది కూడా ఆసక్తికరంగా ఉన్నట్లుంది రోయ్!'' సుబ్బు ఆశ్చర్యపడి నవ్వేడు – ఖైనీ నవ్వు.

''ఎంతవరకు వచ్చాం?''

''మీ ఆవిడగారి జడ దాకా; అదే ప్రేమపాశం దాకా. ఆమె జడ వదిలి కాస్త ముందుకు పో'' సూర్యం ఆవులిస్తూ అన్నాడు.

''ఎంతో ఇష్టం కలిగింది ఆమెంటే. ఆ క్షణాల. ఎవరి భార్యంటే వాళ్లకు, కనీసం కొత్తల్లో, ఉండే ఇష్టం కన్నా ఎక్కువ ఇష్టం అది అని నే భావిస్తున్నా. దానికి నా దగ్గర కొలబద్ద లేదనుకోండి. అన్ని సంవత్సరాలు అవివాహితుడిగా ఎందుకుండి పోయినా అనుకున్నా, అన్ని సంవత్సరాలు ఒంటరిగా, వృథాగా గడిపాననుకున్నా, ఇద్దరం, బస్సు వచ్చిన దారినే కొండ పక్క నించి వెనక్కు వెళ్లాం. ఎడమ చేతివైపు లోయ, రోడ్డు అంచుచేరి, మౌనంగా లోయలోకీ, అవతలివైపు కొండలకేసీ మనోవిహారం చేస్తున్నాం, చూస్తున్నాం. ఆ ప్రకృతి భిన్నత్వాన్ని చూస్తూ ఆమె మరికొంత ముందుకు అడుగు వేయడం నేను గమనించలేదు. ఆ అడుగుకు అరక్షణం పట్టి ఉండదు. నా నోట్లో తడి ఆరిపోయింది. నోట్లోంచి కేక కూడా వెలువడలేదు. కాస్త పెద్దరాయి. దానిమీద నమ్మకంతో ఆమె కాలూనింది. రాళ్లూ మోసం చేయగలవు. అదీ, ఆమే క్రిందికి జారారు. నేను రాయయి పోయా. రెండు, మూడడుగులు కిందికి జారి, మరో కొండ రాయి మీదికి చేరింది. రాళ్లు రక్షిస్తాయి కూడా, ఒక చేత్తో ఒక కొండ మొక్కను పట్టుకుని ఉండిపోయింది''.

కొండ మొక్కలూ రక్షించగలవు''.

''తలెత్తి పైకి చూస్తోంది. అదెలాంటి చూపు? ఆమె వైపు నేను చూసినదెలాంటిది? నాది ఎలాంటిదో నాకు తెలీదు. ఆమెది మాత్రం 'గడ్డి కొరకు కొండనెక్కి కాలుజారి లోయల పడిన జింక' చూపు. ప్రియాతి ప్రియమైన వ్యక్తి శాశ్వతంగా దూరమై పోవటానికి త్రుటికాలం చాలు. నీవే తను, తనే నీవు అనుకునేంత అనుబంధం పెనవేసుకున్న వ్యక్తులు వియోగం పొందటానికి ఉప్పెనలు, ఉపద్రవాలు అక్కరలేదు. కనురెప్ప పాటంత తేలిక కోట్లది జనాభాలో ఆమె ఒక సభ్యురాలు. నిన్నటివరకు ఆ కోట్లాది స్త్రీ జనాభాతో ఉన్న అనుబంధమే. నాకు ఆమెతో ఒకటి రెండు దినాలలో మా మధ్య ఏర్పడిన సంబంధం నిజంగా బలమయినదా, లేక నళినీ దళానికి జలానికీ గల బాంధవ్యం లాంటిదా?

''తిరిగి వచ్చి బస్సులో కూర్చున్నాం. సుంకి నించి గంటన్నర ప్రయాణం. సిమిలీ గూడ వచ్చేంతవరకు కూడా మాట్లాడుకోలేదు ఇద్దరం. అక్కడ అంది ''మరో అయిదు నిముషాలు, అంతే. 'మన' ఊరు చేరతాం''. భయపు పొంగు దిగటానికి అంత దూరం, కాలం కావలసి వచ్చింది. ఘాట్ ప్రయాణంలో నేను చూసిన రమణీయ ప్రకృతి దృశ్యాలను మనిషి రూపంలోకి తర్జుమా చేస్తే ఆ మనిషి నా భార్య – అన్న 'భావం నా మనసంతా నిండింది. పోయిందని ఆశ వదులుకున్న విలువైన వస్తువు తిరిగి పొందితే దాని విలువ ద్విగుణీకృతం అవుతుంది కదా?''

''నీ భార్యంటే నీకు ఎంత ప్రేమరా! ఇంకా అంత ప్రేమ ఉందా?'' సుబ్బు ఖైనీ ప్రశ్న.

''ఏం? నీ భార్యంటే నీకు ప్రస్తుతం అలాంటిదేం లేదా?'' సూర్యం ఎదురు ప్రశ్న.

''సంవత్సరం తర్వాత మళ్లీ ఆ ఘాట్ మీద ప్రయాణం చేసి ఆ ఊరు చేరాను. ఈసారి ఒంటరిగా, ఆ రమణీయమైన దృశ్యాలు విసుగు కలిగించాయి. నేను పొందబోయే అనుభవానికి కాలం ఒక అడ్డు. దూరం ఒక అవాంతరం. డ్రాయింగ్ రూంలో కూర్చుండిపోయా. లోపలి నుంచి నా భార్య వచ్చింది. కన్నీళ్లు పెట్టుకుంది. నేను నేల చూపు చూశా. కాళ్లు కడుక్కోమంది. కాళ్లు కడుక్కుని పడక గదిలోకి అడుగు పెట్టా. చలికి వణకుతూ, కుంపటి వేడికి చలికాగుతున్న కర్పూరపు బొమ్మను చూశా. ఏదో గర్వం. ఏదో కాదు – పాత సిమిలీ వాడాలంటే – ఒక కళాకారుడు వాడి కళా చిత్రాన్ని పూర్తిచేసి చూసుకునేటప్పటిది. నిజానికి ఇది కళా గాదు, నేను కళాకారుడినీ కాదు. కళే అనుకున్నా, సామర్థ్యంతో పని లేనిది..''

## కథాంతరంగం



మా ఆవిడ పుట్టింటి వారు ఒరిస్సా లోని సునాబెడా టౌన్‌షిప్పులో ఉంటు న్నప్పుడు ఒకసారి అక్కడకు నేను వెళ్ళి రెండు వారాలు అస్వస్థుడనయ్యాను. అక్కడ జరిగిన ఓ చిన్ని సంఘటన ఆధారంగా రాసిన ఈ కథ కథాప్రభ శీర్షికన బాపు బొమ్మతో ఆంధ్రప్రభలో (10-07-1996) అచ్చయింది.

ఇందులో విషాద యోగం పాలయింది అర్జునుడు కాదు: శ్రీకృష్ణుడు. స్వీయ జీవిత సంఘటనలతో నైరాశ్యాన్ని మేళవించి గీతకు బదులు చెపుతాడు. అర్జునుడులాగానే ఆషామాషీగా వింటారు మిత్రులు. ఆ గీత పార్థుడ్ని కార్యోన్ముఖుడ్ని చేస్తే ఈ పార్థసారథి వాక్కు కంఠశోషే అవుతుంది. భ్రమల, మాయల పాలవ్వద్దని భజగోవిందం ద్వారా శంకరాచార్యా హెచ్చరిస్తే-పుట్టిన తర్వాత జీవించక తప్పదు కావున, అలా జీవించడానికి భ్రమలను ఆశ్రయించక తప్పదని కథా కృష్ణుడు సూత్రీకరిస్తాడు. టాల్‌స్టాయ్, ఇవాన్ ఇలిచ్ మరణం రాయడంలో భజగోవిందం పాత్ర ఉందా?... నవ్వకండేం.... ఆలోచించండి.


-నవులూరి వెంకటేశ్వరరావు

ఫోన్ : 0891-2507577


''దాన్ని కళగా భావిస్తే సృష్టిలోని మగ జీవాలనంతా కళాకారులుగా భావించుకోవలసి వస్తుంది''.

''మోసి, కనే ఆడజీవులు, మగజాతికన్నా పెద్ద కళాకారులవుతారు''.

''ఎంత నిజం పలికావురా భద్రం! జీడిపిక్కల్ని తినటం కూడా క్షణం ఆపి! రెండు మూడు రోజులుండి ఆ పసికందుని వదిలి వెళుతున్నపుడు, క్రింద పళ్లని, పై పళ్లని గిట్టకరచి పెదవులు బిగించి ఉంచాల్సొచ్చింది - వాటి వణుకును అరికట్టడానికి..''

''అంత చలన్నమాట''.

''అంతటి చలీ ఉంది ఆ రోజుల్లో. ఆ కారణంగా కాదు నోటిని అదుపు చెయ్యటం. రుక్మిణీ, పాప నా ఇల్లు చేరటానికి మరో రెండు యుగాల వుతుంది. నేను మరో జీవి గురించి బతకాల్సి ఉంది''.

''సుబ్బూ, నాకూ ఖైనీ ఇంత ఇవ్వవూ?''

నోట్లో ఉన్నదాన్ని పిట్టగోడ దగ్గిరకెళ్లి కిందికి ఊసి, జేబులోంచి పొట్లం అపురూపంగా తీసి, సూర్యం చేతిలో కొంచెం పోశాడు. కొంత పొట్లాం నించే నోట్లోకి వంపుకుని, నాలుకతో కింద పెదవి పళ్ల మధ్యకు తోసి, తలతో సంజ్ఞ చేశాడు చెప్పే విషయాన్ని కొనసాగించమని.

''మరోసారి ఆ ఊరెళ్లాను. ఆ రాత్రి ఉన్నట్లుండి మేల్కొన్నా, ఫ్యాను నెమ్మదిగా తిరుగుతోంది. చలిని చిలికి మరింత చలిని పుట్టిస్తూ, స్విచ్ వేయబడి కను తెరచిన వెలుగు. ఆలోచనా స్రవంతి సుషుప్తిలో ఘనీభవించి, మెలకువలో కరిగి పారుతోంది. అవగూడదని అవుతున్న చప్పుళ్లకు నిద్ర పూర్తిగా జారిపోయింది. 'వెళుతున్నానండీ' అంటోంది నా భార్య... రొద చేస్తున్న అంబులెన్సు దూరమై పోయింది. దాని రొదను, ఆమెను, ఆమె తండ్రిని తనతో గొనిపోయి, ఆ వియోగం దుర్భరమనిపించింది. మరో జీవితాధ్యాయం ఆరంభమవబోతోంది. మరో ముఖ్యమయిన జీవిత సంఘటన జరగబోతోంది. ఈ అధ్యాయంలో ఏం జరుగుతుంది? కొత్త పాత్ర ప్రవేశమా, పాత పాత్ర నిష్క్రమణమా?

''కొడుకు పుట్టాడయ్యా'' అని వెళ్లిపోయాడు రుక్మిణి నాన్నగారు, ఎప్పుడు తిరిగి వచ్చాడో. మంచం మీద లేచి కూర్చున్నా, పక్కన, నిద్రవడిలోని ప్రథమ సంతానాన్ని ముద్దు పెట్టుకున్నా - ఆనందం పంచుకుంటూ, తెల్లారి వెళ్లి చూశా. 'శాక్యముని పుట్టాడా' అనిపించింది. తీర్చిదిద్దిన రూపు రేఖలు. ఏదో దేవలోకం నించి దీర్ఘప్రయాణం చేసి ఈ ఆస్పత్రి చేరిన అలసట కళ్లు; సేద తీర్చుకుంటున్నాడు. తండ్రిని కూడా చూడాలనిపించని స్థిత ప్రజ్ఞత. కళ్లు తెరచి ఇప్పుడే కరుణించడీ గౌతముడు. సుఖం వదిలిన అణువు; కాలం వడిలో, చీకటి గర్భంలో పెరిగి పొందిన రూపు - అపురూపమయింది.

''ఎర్ర శాలువా కప్పుకున్నట్టిదిన్నీ, విరబోసుకున్న నొక్కుల జుత్తుగలదిన్నీ అయిన మలయాళీ నర్సు తెలుగులో అడిగింది - 'బాగుండాడా?' భాషలేని నవ్వు నవ్వేను. ఆ అపురూపం నాకు దక్కటంలో ఒక చెయ్యి వేసిన ఆమె మీద కృతజ్ఞతాభావం...''

ఎవరో నవ్వేరు. అది ఖైనీ నవ్వే. ఇద్దరు ఖైనీ మత్తు మాయలో ఉన్నారు. నవ్విందెవరూ?

ఇంకొకరున్నారు, ''రెండు చేతులూ కాదా?''

ఇక ఆఖరి ఘట్టానికి వచ్చాం.

''పిల్లలూ, భార్య ఊరెళ్లి రెండు వారాలయింది, సంవత్సరాలు కాదు. నేనూ వెళ్లి, రెండు రోజులుండి వాళ్లతో తిరిగి రావాలని ఆలోచన. తుఫాను గాలితో ఆరంభమయింది పయనం. విశాఖపట్నం నించి విజయనగరం వెళ్లి అక్కడ నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు, లగేజి బస్సులాంటి ఒరిస్సా వారి నౌరంగాపూర్ బస్సులో ప్రయాణం. నవంబరు మాసపు చలికి తోడు ఈదురు గాలుల కోతను, రెండు గంటల ఎదురు తెన్నులను భరించిన తర్వాత వచ్చింది బస్సు. ఆ బస్సు ప్రయాణం కన్నా సుంకి లోయలో పడి మరణించడం మేలు. తెలిక అనిపించింది. పొట్టంగి దగ్గిర వర్షం ఆరంభమయింది. పొట్టంగి గంగమ్మ దేవత ఆశీస్సులతో, బస్సు దిగి ఇల్లు చేరేసరికి నేను వాళ్లకి ఒక ఫౌంటెన్‌లా తోచి ఉంటాను. 'డాడీ ఎలా ఉన్నారో' అని తప్పట్లు కొట్టింది నా కూతురు. భయం భయంగా, కొత్త వ్యక్తినో వింత జంతువునో చూసినట్లు చూసి తల్లి వెనుక దాక్కున్నాడు నా కొడుకు. ''గది తడిపేస్తున్నారు; వరండాలో ఉండండ''ంది నా భార్య,

''అంత చిన్న విషయాలూ భార్యలు చెప్పాలొరే? మనం తెలుసుకోవద్దూ?''

''ఆ ఊళ్లో, ఆ రోజుల్లో, ప్రశాంతత, నిశ్శబ్దం నెలకొని ఉండేవి. మనుషులూ గట్టిగా మాట్లాడుకునే వాళ్లు కాదు - అది అపవిత్రంలా, అత్యాచారంలా; వైరిగడ్డ మీద శత్రువుల మధ్య జీవిస్తున్నట్టు. అప్పుడొకటి, అప్పుడొకటి వాహనాలు మాత్రం నిశ్శబ్దాన్ని చీరేసి వెళ్లేవి. అది మనిషి ప్రేమించే వాతావరణం; ద్వేషించేది కూడా అర్థరాత్రి, నిశ్శబ్దానికే నిశ్శబ్దం. రెండు రోజుల తర్వాత, అలాంటి అర్థరాత్రి, భీముడు ఉక్కు పిడికిలితో కడుపులో గుద్దినట్లు, పొట్ట పట్టుకుని మంచం మీద లేచి కూర్చున్నా... నోటి వెంట అమ్మా అన్నమాట కూడా వెలువడనీయని నొప్పి, నాకేమవుతోంది? ఏ ప్రమాదం జరిగింది? బాధ విశ్వరూపం ఇలా ఉంటుందా? సూక్ష్మరూపంలో, కడుపులో ఎవరో దూరి, పదును పళ్లతో నరాలు కొరుకుతున్నారు. మరణం తన రాకను, సామీప్యాన్ని తెలియచేసే విధానమేమో, ఎవరూ తీర్చలేరు. ఎవరూ పంచుకోలేరు. ఎవరి చావు వాడిదే. ఎవరి బాధ వాడిదే - ఎవరి ప్రేమ, బాంధవ్యం రక్షించలేవు. ఇంట్లో వాళ్లని లేపటం వలన ఏ ప్రయోజనమూ కనబడలేదు. ఎవరికీ నిద్రాభంగం కలగకుండా మంచం మీది నించి లేచి, డబ్ల్యూసీలోకి వెళ్లా. కడుపు కాస్త ఖాళీ అయి నొప్పి తగ్గేనని పించింది. వర్షపు చప్పుడు వింటూ అలాగే కూర్చుండిపోయా. ఎంతసేపని అలా ఉండి పోవటం? లేచి వెళ్లి మంచం మీద వాలేను. వర్షపు చప్పుడు మఫుల్గా వినవస్తోంది; ఎవరో దాని నోరు నొక్కిపెట్టి ఉంచినట్లు, దాని బాధలో దాని ఏడుపు కూడా దాన్ని ఏడవనీయకుండా, రగ్గు మొహం మీదినించి కప్పుకున్నా - చలి బారి నుంచి రక్షణకి. లోపలి హింసను ఏ వ్యక్తి, ఏ వస్తువు ఆపగలడు, గలదు? ఆ హింస లేకుండా ఉండి ఉంటే ఆ అర్థరాత్రి తలుపు తడుతున్న అందమయిన ఆగంతకురాలి ఆగమనం లాంటి వర్షాన్ని ఆహ్వానించి ఉండే వాడిని; అది మరతుమన్నా మరుపురాని స్మృతిగా మిగిలేది. ఆ శారీరక స్థితిలో అర్థరాత్రి వర్షం వెరపు కలిగిస్తోంది. బాధలో పరిహాసంలా తోస్తోంది. ఆనందాన్నివ్వగల గుణం, వెరపు కలిగించే గుణం వర్షంలో లేవు. ఇక్కడున్నాయి''.

''ఎక్కడా? కణతలలోనా?''

''నీకు బహుశా లేదులే అది - దాంట్లో! రగ్గు కప్పుకుని మంచం మీద వాలిన పది నిముషాల్లో మళ్లీ లేచి ఆ చోటుకు వెళ్లాల్సొచ్చింది. అది ఒక బాధను విసర్జించే స్థలంలా, నిజంగా బాధ అక్కడ తగ్గుతోందా లేక ఒక భ్రమా? బాధా ఒక భ్రమే అనుకుని నిర్వికారంగా ఉండగలిగితే అంతకన్నానా, ఆ స్థలంలో వేదన తగ్గుతుంది అనుకునే భ్రమ ఒక ఉపశమన్నాస్తుంది. మంచం మీద నించి పదేపదే లేస్తూ కొంత రాత్రి గడిచిన తర్వాత, పడక గదికి తిరిగి వెళ్లటం అక్కడ నుంచి ఆ చోటుకు వెళ్లటం కన్నా డబ్ల్యూసీలో ఉండిపోవడం ఉత్తమం. లోవర్స్‌లో నించి తెల్లటి ఆకాశం కనిపిస్తోంది. కురిసే వాన కనబడటం లేదు. కనబడని ఉనికి - బాధలా వినిపిస్తోంది. తన అస్తిత్వాన్ని

## లోకరీతి రుబాయీలు




బతికుండగా బాధలు పెట్టి చంపి ఖననం చేస్తారు
చచ్చాక లబోదిబోమని దినం ఘనంగా చేస్తారు
ఎంత వింత క్రూర కుటిల జటిల జనలోకమిదీ!
భయంకర నరకముందన్నా నకరాల్తో బతికేస్తారు

***



శ్మశానంలో పరుండడానికి మనిషికి కులం లేదు
విశాల విశ్వంలో ఆ కలకలం లేకుండా ఏదీ లేదు
మను భావాల పెను వృక్షం కూలనంత వరకు మెట్టా!
వర్ణ చేదు అనుభవాలకు అంతం లేనే లేదు

***



పట్ట పగలంతా పాడు పార్కుల్లో కలుస్తుంటారు
తప్పుతుప్పల్లో జోడు పాములల్లే మెలివేసుకుంటారు
ఆ కలయికల కాంతులే కన్యల నోట వాంతులు
భంగపడిన భామలేమో భ్రూణ హత్యలు చేస్తుంటారు

***




ధర్మమన్న మాట లేనేలేదు ఈ జగాన
అధర్మం వైపునకే నరులందరూ వేగాన
నడుస్తూ ఆదర్శాల్ని అవలీలగా విడుస్తూ నాగూ!
కర్మకాలి పోతున్నారు పాపాన్ని మోసే రోగాన

***




హాపీ జన్మదినమంటే కేకులు కోస్తున్నారు
పాడు జన్మమెందుకంటే పీకలు కోస్తున్నారు
సిగ్గు ఎగ్గు వదిలేసి బరితెగించిన ఈలోకాన
డబ్బు కోసం సినీ తారలు చీరలు తీస్తున్నారు

***




ధర్మరాజు పేరు పెట్టుకుని అధర్మంగా నడుస్తుండె
కర్ణనామం పిలిపించుకుంటూ దేబిరిస్తూ ఉండె
నామ సార్థక్యమంటే నేడు తారుమారయ్యారో చూడు!
సాధ్వి సావిత్రి పేరుతోనే వ్యభిచరిస్తూ ఉండె

***




సెల్లుంటే ఉబుకుతుంది ఒకటే సొల్లు ఊట
బిల్లు పేలుతున్నా విడువరండి ఏ పూట
పని పాటలేని పిచ్చివాళ్లున్న ఈ కాలాన
బహిర్భూమి కెళుతున్నా సెల్లు వాణి తీట

***



కీర్తికాంక్ష తోటి కవిత్వం రాసే వాళ్లున్నారు
కాసు కక్కుర్తితో వ్యక్తిత్వం విడిచే వాళ్లున్నారు
అత్యాశా బలహీనతలు నెత్తికెక్కి తొక్కుతుంటే
క్వార్టరు మందుకోసం పీకలు కోసే వాళ్లున్నారు

***



చందమామ రావే నాటి లాలిపాట
బూచోడా రారా నేటి జోలాలిపాట
అందమంత కోతి రీతి మారెను కదోయీ!
ఏవండి పోయి ఏరా వస్తుంది భార్యల నోట

***



దేవుళ్లు రాతి ప్రతిమల్లో ఉంటారని నమ్మేవాళ్లు
బొమ్మల పెళ్లిళ్ల కోసం సొమ్ములు విరజిమ్మే వాళ్లు
కో కొల్లలుగా ఉన్నారు ఈ మాయదారి లోకంలో
వెర్రి పనులు చేస్తూనే వైస్రాయ్‌లా భ్రమించే వాళ్లు

–మెట్టా నాగేశ్వరరావు

**99510 85760**

నిరూపించుకోటానికి – ఎవరూ నిరూపించుకోమని అడగకుండానే, తల విసిరినట్లయింది. జి.ఐ. పైపు పట్టుకున్నా, చల్లగా, జిల్లుమనిపిస్తూ చావు లక్షణాన్ని గుర్తుచేస్తోంది. తలెత్తి చూస్తే ఫ్లషౌట్ టాంక్ క్షణకాలం గిలటీన్‌లా తోచింది. భయం కన్నా, క్షణం ఓదార్పునిచ్చింది. ఎంత సౌఖ్యాన్నివ్వగలదో అంతటి వేదనా నిక్షిప్తమయిన వింత సృష్టి మానవ శరీరం. 'నా' అనుకున్న వాళ్లు, ఇంట్లో నిద్రాసుఖం అనుభవిస్తున్న వేళ ఆ నాలుగు గోడల మధ్యన ఇరుకులో బాధకు బందినీ. బాధ అనే 'ప్రతి కూల పవనాలు నా మనోనావని పలుతోవలు పట్టిస్తున్నాయి'.

''తెల్లవారు ఝాముదాకా అవే పాట్లు. ఆ తర్వాత నిద్రపట్టింది. అది ఒక తాత్కాలిక విరామ చిహ్నం. వర్షానికి మాత్రం విరామం లేదు. తెల్లారి రుక్మిణి నాన్నగారిని ఆస్పత్రికి తీసుకెళ్లమన్నా, ప్రాణం పొయ్యేది, కంపెనీ వైద్యులు బయట వాళ్లని చూడటం. మనిషి ప్రాణం కన్నా వాళ్ల నిబంధనలు ఎక్కువ విలువైనవి. పవిత్రమైనవి. ఆయనకు తెలిసిన కంపెనీ డాక్టరు ఇంటికి గొడుగులో వెళ్లాం''.

''గొడుకు లేకపోతే ఆయన రానీడా?''

''ఆ వైద్యుడు ముందు మొహం చిట్లించాడు తనే ఏదో జబ్బుతో తీసుకుంటున్నట్టు – మరో వైద్యుడి అవసరంలో తనే ఉన్నట్లు. వైద్యుడూ రోగి అవుతాడు. తల వంచుకుని (తన జబ్బుకి తను సిగ్గుపడుతున్నట్టు) జబ్బేమిటి అని ఒరియాలో అడిగాడు. ఆంగ్లంలో చెప్పాను. ఆయనది కాదు, నాది. టెలీఫోను మ్రోగి ఆగింది. లోపల్నించి ఆయనకు పిలుపొచ్చింది. మాబారినించి ఆయనకు ఉపశాంతి. పది నిముషాల పాటు దాన్ని లోపల పొంది, డ్రాయింగ్ రూంలోకి తిరిగి వచ్చాడు, వేషం మార్చుకుని – వానకోటు, బూటు వేసుకుని. ''నేను ముఖ్యమయిన పనిమీద వెళ్లాలి. మీరొక పని చెయ్యండి. మన ఆస్పత్రికి వెళ్లండి' అన్నాడు. ఆయన ఉంటే ఈ బార్బర్‌తో పనేమిటి? ఆ విషయం ఆయనకు తెలియనిది కాదు. నిద్ర నటించే వాడ్ని లేపే ప్రయత్నమెందుకు చేయటం?

''వాళ్లు చూడరు డాక్టర్జీ'' అన్నాడు రుక్మిణి నాన్నగారు.

'వాళ్లు చూడనప్పుడు నేను మాత్రం ఎందుకు చూడాలి?''

''ఈ వితర్కాన్ని ఎదుర్కొనటం వృథా. మా మామగారు ఆయనకు ఏదో చెప్పబోతుంటే వారించాను. చటుక్కున లేచిపోయి రోడ్డు మీదికి వచ్చేశాను. 'అరరే తడిసి పోతున్నావ్' అన్నాడాయన. తడపటం అయిపోయింది. 'పోనీ ఆస్పత్రికెళ్లి ప్రయత్నిద్దాం' అన్నాడాయన. ఏ మాత్రం ఓపిక ఉన్నా, ఆస్పత్రీ లేదు గీస్పత్రీ లేదు అనే వాడిని కోపంగా, కానీ బాధకు బానిసను. మూగగా ఆయనతో నడిచాను – ఆయనకూ బానిసలా. అడ్డుగా, ఫెన్సింగ్ మొక్కల కంతలోంచి ఆస్పత్రి ఆవరణలోకి నడిచాం.

''డాక్టర్ వీ.డీ. మొహంతి అన్న ఆసామి గదిలోకి వెళ్లాం...''

''రోగులను భయపెట్టే పేర్లున్న వ్యక్తులకు మెడికల్ డిగ్రీ లివ్వకూడదని ఆలిండియా మెడికల్ కౌన్సిల్ సిఫారుసులో, ఆదేశాలో లేవా?''

''ఇద్దరో ముగ్గురో నా జాతి వాళ్లున్నారు. నిలబడలేక బెంచీ మీద కూర్చుండిపోయాను. ముగ్గురు రోగులకు చీటీలు రాయటం నిమిషంలో పూర్తి చేశాడు డాక్టరు. పట్టుకోకుండానే రోగుల నాడి తెలిసి పోయినట్లు, ముందుకు రాకుండానే రాబోయే రోగి లక్షణాలు తెలిసిపోయి చీటీలు రాసి ఉంచి చేతికిచ్చి పంపినట్లు వెళ్లిపోయారు. తల ఎత్తకుండానే, 'బోలియే' అని కేసు షీట్‌కై చేయి చాపాడాయన. అసలు విషయం చెప్పాడు మామగారు.

'బయటవాళ్లను చూడటానికి రూల్సు ఒప్పుకోవని తెలీదా?' అన్నాడు ముద్దాయిని నిలేస్తున్న న్యాయమూర్తిలా.

'మహాపాత్రాగారు మీకు చెప్పమన్నారు చూడమని'.

'ఆయనే చూడొచ్చుగా?'

'ఎక్కడికో వెళ్లే తొందరలో చూడలేకపోయారు..'

'ఈ వర్షంలో ఈ ఊళ్లో ఏం అర్జంటు పన్లుంటాయో నాకు తెలీదా?'

''అని మొహం కందగడ్డ చేసుకున్నాడు. మేం అవమానించినట్లు.

''ఏం మాట్లాడాలో తెలీక మౌనంగా నిల్చుండి పోయాం.

'ఇంతకూ ఏమిటా జబ్బు?'

''చెప్పాను'.

''తిండి మితంగా తినాలి' అని రూల్సు అడ్డురాని హితవు పలికి, 'లాబ్ అసిస్టెంటు శలవు; పరీక్షలు చెయ్యకుండా మందులు రాయకూడదు' అన్న బ్రహ్మార హాస్యం వెల్లడి చేశాడు.

''మనసు మార్చుకుంటాడేమోనని ఆశగా చూశాం. ఫ్యాను ఎక్కువ రొద, తక్కువ గాలితో నింపుతోంది గదిని. ఆ రొద కారణంగానో, తగిలే గాలి సంతృప్తిగా లేకనో, మా ఉనికి అసౌకర్యంగా తోచో; వాటిలో ఏ రెండు కారణంగానో, ఉమ్మడిగా ఆ మూడింటి వలననో – తల వంచి ఉంచిన ఆ వైద్యుడు, దాన్ని ఎత్తి ఫ్యాన్ను, మమ్మల్నీ చికాకుగా చూశాడు.

మెడను చుట్టిన స్టెతోస్కోపు పాములా అనిపించి, శివుడు కాని వైద్యుడు దాన్ని టేబుల్ మీదికి గిరాటేశాడు. నిష్క్రమించబోతున్న సర్వసంగ పరిత్యాగిలా తోచాడు.

''ఆస్పత్రి వరండాలోకి వచ్చాం. మలయాళీ నర్సు చలికి ఎర్రశాలువా కప్పుకుని విచారంగా వర్షంలోకి చూస్తోంది...''

భద్రం నవ్వేడు.

''ఈ మధ్య మన స్థిమితం తప్పుతోందిరా?'' సూర్యం అడిగాడు.

''మలయాళీ నర్సు, ఎర్రశాలువా, వర్షం, చలి, వగైరా అంటుంటే వాడికేవో తలపులు కలిగి ఉంటాయి లేరా. తిండి గురించి తప్ప మిగతా ఆలోచనలుండవా వాడికి''.

''నా సుపుత్రుడు పుట్టినప్పుడు కలిగిన ఆనందం, ఉదయపు ఆస్పత్రి వాతావరణం, ఉన్నతంగా ఆకాశాన్ని తాకుతున్న యూకలిప్టస్ చెట్లు, పరిసరాలపై కలిగిన ఆత్మీయత - అన్నీ గుర్తుకొచ్చాయి. ఇప్పుడు ద్వేషం, కోపం, భయం కలుగుతున్నాయి.

''ఒక పనిచేద్దాం అన్నాడు ఆ ఆశావాది, చచ్చిన ఆశకు చేరెడు నీరు పోస్తూ వర్షం మీదినించి చూపు మళ్లించి ఆయన వైపు చూశాను. 'ఎన్‌పీసీ ఏరియాలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఉంది అక్కడికి పోదాం' వెళ్లాం. అక్కడ ఒకే డాక్టరున్నాడు. గోపాళ్లని, రత్నాలని చప్పరించి పళ్లు ఎర్రగా గారబట్టాయి. నవ్వు ముఖం. ఎత్తు బల్ల మీద పడుకోబెట్టి, చొక్కా ఎత్తి పొట్టంతా చపాతీ పిండి పిసికినట్లు పిసికాడు. రోగ నిర్ధారణ అయిపోయినట్లుంది. లేచి పొమ్మన్నాడు. రెండు రకాల మందులు రాసి ఎలా వాడాలో చెప్పాడు. ఫార్మసిస్టు దగ్గర వాటిని తీసుకున్నాం. వాటికి కాలదోషం పట్టి వారం రోజులవుతుంది. ఆ విషయం డాక్టరుకి చెబితే ఫర్వాలేదు బాబూ, వారమేగా అయింది' అని భరోసా ఇచ్చాడు. ఫార్మసిస్టు దగ్గరకి తిరిగి వెళ్లి గలీజు గ్లాసుతో నీళ్ల తీసుకుని, మాత్రల్ని బఠానీల్లా గొంతులోకి విసురుకుని నీళ్లతో వాటిని లోపలికి కడిగేశాను. ఇంటికి వచ్చేశాం. జబ్బు తగ్గిపోతుందన్న కొండంత ఆశతో మెట్లెక్కేను. ఆశ అనే ఇంధనం ఇచ్చిన శక్తివల్ల నీరసమనిపించలేదు. పడకగదికి వెళ్లి మంచం మీద వాలిన గంటకు గొంతులో మంట ఆరంభమయింది. తలనొప్పి, కణతలలో నరాలు లాగుతున్నాయి. నా భార్య మంచానికి దగ్గిరగా వచ్చింది. ఎలా ఉందని అడగటానికేమో, ఇలా సాగింది సంభాషణ.

'ఊరెళ్లిపోదాం'.

'వర్షంలో, మీ ఈ స్థితిలో ఎలా?'

'బస్సు ఎక్కిన తర్వాత వర్షం ఏం ఇబ్బంది? ఈ నరకం అనుభవిస్తూ ఇక్కడ గడపడం కన్నా ఆరు గంటలు ఓపిక పట్టి ఊరు చేరటం ఉత్తమం'.

'నాన్నగారికి చెబుతా'.

'అమ్మనాన్నల అనుమతి తర్వాత తీసుకోవచ్చు. బట్టలు సర్దు'.

''బట్టలు సర్దుతుంటే ఆయన వచ్చాడు. విషయం అడిగి తెలుసుకున్నాడు.''.

'ఇప్పుడే తెలిసింది. ఘాట్ రోడ్డంతా పెద్ద పెద్ద బండరాళ్లు దొర్లి రాకపోకలు ఆగిపోయాయి. కొన్నిచోట్ల కొండచరియ కూలిందట. రెండు మూడు రోజులు పడుతుంది. రహదారి బాగుపడటానికి అదైనా వర్షం తగ్గితే', అన్నాడు.

''నాపై సాగే కుట్రలో ప్రధాన నేరస్థుడిలా తోచాడాయన; ప్రాణం కోసం పారిపొయ్యేవాడిని సైంధవుడిలా అడ్డుతూ''.

''నా తల తిరుగుడు ఎక్కువయింది. చావు మాత్రమే నా వ్యాధికి సరైన ఔషధం. నా తరపున ఎవరన్నా యముడికి సిఫారసు చేస్తే బాగుండును. ఏదో ఆమ్లం కడుపులోనించి పైకి ఉబికి, గొంతుదాటి నోట్లోంచి బయట పడింది. నాకే తెలియని ఏదో అవమానంతో సగం చచ్చాను. మిగతా సగాన్ని మరొకటేదన్నా చంపితే విముక్తుడినయ్యే వాడిని. అది ఊరు కాదనిపించింది; నన్ను కప్పి పెట్టే వల్లకాడు. అక్కడి మనుషులు మనుషులు కారు. హింసించే ప్రశాంతత నరకం కన్నా అధ్వాన్నం.

''కురిసే వర్షం ప్రళయం; అకారణంగా పగబట్టిన శత్రువు. 'తాబేలు తన అవయవాల్ని లోపలికి ముడుచుకున్నట్టు 'మనసును ఆయా ఆలోచనల నుంచి బాధ నుండి, ద్వేషం నుంచి, అవమానభారం నుంచి ఉపసంహరించుకోగలిగితే ఎంత ధన్యుడిని!'

''సగం రాత్రి దాకా నా భార్య మేలుకుని ఆ తర్వాత నిద్రకు తాళలేకనో, నేను నిద్రపోయాననుకునో, అస్తవ్యస్తంగా పడి నిద్రపోతోంది. గుండెల దాకా దుప్పటి లాక్కుని - ఎవరితో ఎలాంటి సంబంధం, అనుబంధం తనకు అక్కర లేదంటున్నట్లు. బరువు ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు గాలితిత్తిలా వక్షం కదులుతోంది. కింది పెదవి కాస్తంత కిందికి జారి, పొగరైన ఎదురు ప్రశ్నని అడిగినప్పటిలా ఉంది పెదవుల అమరిక. యమపాశంలా జడ మంచం కిందికి వేలాడుతోంది.

''చంటాడు మా ఇద్దరి మధ్య బుసకొడుతూ నిద్రపోతున్నాడు. తల వాళ్లమ్మ వైపు, కాళ్లు నావైపు ఉంచి అడ్డుగా తిరిగిపోయాడు. ఈ మంచం నాది, మీకు నేను చోటివ్వను అంటున్నట్లు. మా మంచం పక్కన దిగువగా, చిన్న నవారు మంచం మీద పాప నిద్రపోతోంది. నిశ్చింతగా - వాళ్లమ్మలా, తమ్ముడిలా.

''కసిగా వాళ్లందర్నీ లేపుదామనుకున్నా, నా బాధ తీరటానికి వాళ్ల మెలకువ ఏ విధంగానూ సహాయ పడకున్నా, నేనీ స్థితిలో ఉండగా మీరు ఎలా నిద్రపోతున్నారూ అని కనీసం అడగటానికి. నా బాధకు పరోక్షంగా వాళ్లు బాధ్యులు అనిపించింది. అలాంటి శత్రువుల మీద అనురాగం, అనుబంధం ఏమిటి నా పిండాకూడు?''

''కాతేకాంతా కస్తే పుత్రః, సంసారో యమ తీవ విచిత్రః'' సుబ్బు అన్నాడు.

''అంతేకాదు - పశ్చాజ్జీవతి ఘుర్జర దేహే, వార్తాంకోపి న పృచ్ఛతి గేహే'' అంటూ సూర్యం లేచి, మిగతా వాళ్లనీ లేపేశాడు పోదామని.

నేను చెప్పాల్సింది ఇంకా ఉంది. రాత్రి పదయింది. చెప్పే ఓపిక నాకు ఉన్నా, వినే ఓపిక వాళ్లకు ఉండద్దూ? నేను చెప్పినది ఆసక్తికరంగా లేదేమో! పైగా, నా తత్వం వాళ్ల, 'సంశయాలు, తొలగించి, అజ్ఞానాన్ని నశింపచేసేది' కాదు గదా.

చంద్రుడిని కారు నలుపు మబ్బు మాయలా కమ్మింది. చీకటిగా ఉంది. క్షణ కాలపు కిందటి వెన్నెల ఇప్పుడు ఒక జ్ఞాపకం. ఆ చీకట్లో, ధృతరాష్ట్రుడిలా వాళ్లు తడుముకుంటూ మెట్లు దిగి, రుక్మిణి దగ్గిర సెలవు తీసుకుంటున్నారు. ఆమె అటు పక్కకు తిరిగి ఉంది. ముళ్ల కంచెకు తగులుకుని వేలాడే సర్పశల్యంలాంటి పీలిక జడతో.

పళ్లెం, చెంబు, గ్లాసులు పట్టుకుని నేనూ ధృతరాష్ట్రుడిలా తడుముకుంటూ మెట్లు దిగుతూ అనుకున్నా; విని వుంటే వాళ్లకు మిగతా అనుభవాన్ని వినిపించి, బ్రతకటానికి భ్రమలూ అవసరం అని ముగించేవాడిని.

★



## అనుష్క ఆశలన్నీ డిసెంబర్ మీదనే!

'అరుంధతి' తర్వాత ఆ స్థాయిలో అనుష్కకు హిట్లు లేవు అన్నది జగమెరిగిన సత్యం! ఆ తరువాత వచ్చిన 'వేదం', 'పంచాక్షరి', నిన్న మొన్న వచ్చిన 'ఖలేజా' పరాజయాలు అనుష్కను ఐరన్‌లెగ్ కిందే జమకట్టబోతున్నాయి. ఇన్ని ఫట్లు వచ్చినా అనుష్క డిమాండ్ మాత్రం తగ్గకపోవడం అన్నది ఆమె పర్సనాలిటీ మహత్యమే అని అందరూ అంగీకరిస్తారు. గతంలో ఎదురైన చేదు అనుభవాలను మరిచిపోయి, రాబోయే డిసెంబర్ మీదనే అనుష్క బోలెడన్ని ఆశలుపెట్టుకుందట! డిసెంబర్‌లో ఆమె నటించిన 'నాగవల్లి', 'రగడ' రెండు చిత్రాలు విడుదల కానున్నాయి. ఇవి విజయవంతం కాకపోతే టాలీవుడ్ నుంచి అనుష్క తట్టాబుట్టా సర్దేసుకోవలసిందేనని సినీ వర్గాలు జోస్యం చెబుతున్నాయి.